కె.వి.ఎస్.ఆర్

# ఆత్మహత్య



"తూ్వా" అంటూ వుమ్మేసి గట్టిగా ఆఖరి దమ్ము లాగి చార్మినార్ సిగరెట్టుని బలంగా రైల్వే ట్రాక్ మీదకి విసిరాడు సింహాచలం.

సింహాచలం పెద్ద అందంగా వుండడు-

చామన చాయగా, బలంగా వుంటాడు.

అతను అంత పొడవూ కాకుండా పొట్టి కాకుండా వుంటాడు.

అతనికి చెవుల చివరి దాకా చెంపలు, మూతికిందిదాకా మీసాలు వున్నాయి.

అతని కళ్ళు అవతలి వాళ్ళల్లో వున్న అమాయకత్వాన్ని చతుర్గా పని గట్టేసే మిలట్రీ కళ్ళు-

అతనిది రింగు రింగుల వొత్తు జుట్టు.

ఆజుట్టుగాలికి ఎగురు తుంటే ఏదో సినిమాలో గుర్రబ్బండి వాడి వేషం వేసిన హీరోలా వుంటాడు.

అతనిహ్వాళ తెల్లటి టెరికాట్ పేంటు, షర్టు వేసు కొన్నాడు. నిన్న రాత్రి "యెంటర్ ది డ్రాగాన్" సినిమా చూడ్డంతో అవి కొంచం నలిగి, మాసి నట్టవుపిస్తున్నాయి.

అప్పుడప్పుడు అందులో "బ్రూస్‌లీ" లా పిడికెళ్ళు మూసి ఆపోజు వచ్చిందో లేదోనని చూసుకొంటున్నాడు.

సింహాచలం పది గంటలకే రైల్వే స్టేషన్‌కి వచ్చాడు.

ట్రైన్ కోసం వెయిట్ చేస్తున్నాడు

ట్రైన్‌కిటైం అయిందని ఆదరా బాదరాగా పరుగెత్తు కొంటూ వచ్చి చేరాడు స్టేషన్‌కి.

తీరా చూస్తే ట్రైన్ గంటన్నర లేటు-

ఇవాళ పెద్ద పండుగ అవడ తో స్టేషన్ నిండా జనంవున్నారు.

ట్రైన్ లేటు అవడంతో అందరూ 'ఇందిరా గాంధీ' మొదలు ఉగాండా ప్రెసిడెంటు 'ఇదీ అమీన్' దాకా కథలు మొదలెట్టారు.

సింహాచలానికి చిరాగ్గావుంది - ఆకాశం అంతా మబ్బులుపట్టి డల్‌గావుంది.

అలాగని అతని చిరాకు మబ్బుల మీద కాదు.

సింహాచలానికి చాలా కోపంగా వుంది- అతని చుట్టూ జనం వున్నారు.

కాని అతని కోపం జనం మీద కాదు,

లేటయిన 'పాసింజరు ట్రైన్' మీద.

అతనికి ఎదురుగా ఓ గుండు అబ్బాయి [మొన్ననే తిరుపతి వెళ్ళినట్టుంది] రేడియోలో పాటలు వింటూ ఎదురుగా వున్న "అమ్మడి" కి లోకువ పోజులు అమ్మేస్తున్నాడు.

అమ్మడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ తమ్ముడితో కాటోలు ఆడుకుంటోంది.

ఆ అమ్మడ్ని చూడగానే సింహాచలానికి "సీతారత్నం" గుర్తుకొచ్చింది.

సీతారత్నం ఎవరో కాదు సింహాచలం భార్యే!

అదిగో సింహాచలం కోపానికి కారణం అది-

సింహాచలానికి కొత్తగా పెళ్ళయింది. పెళ్ళయి నాలుగు రోజులు తిరక్కుండానే "ఆషాఢ మాసం" అంటూ అత్తగారు సీతారత్నాన్ని కూడా తీసుకు వెళ్ళి పోయారు.

మొన్నటితో ఆషాఢ మాసం వెళ్ళి పోవడంతో అత్తగారు మంచి రోజు చూసి యివ్వాళ 'సారె'తో పాటు తీసుకొస్తానని ఉత్తరం రాసారు.

అందుకు అతను చాలా సంతోషించాడు.

ఇప్పుడు ట్రైన్ లేటు

అతని "పెళ్ళాన్ని ఎంత తొందరగా చూస్తానా" అని వుంది,

తీరా చూస్తే ట్రైన్ లేటు

అలాగని ఈ ట్రైన్ లేటుకి, సీతారత్నం రాకకి సంబంధంలేదు.

ఎందుకంటే సీతారత్నం పొద్దున్న బండి లోనే వెళ్ళి పోయింది.

అలా వెళ్ళి పోయిందని సింహాచలానికి తెలుసు.

సీతారత్నం వచ్చే సమయానికి అతను సామాన్లకి స్టీలు కోటింగ్ వేయిస్తున్నాడు. అందు చేత ఆమెను కలవలేక పోయాడు. ఆ తర్వాత అతనికి 'బిజినెస్' వుంది ఇంటికి వెడితేగాని పెళ్ళాన్ని చూడలేడు. బిజినెస్ అయితేగాని యింటికి వెళ్ళలేడు ట్రైన్ వస్తేగాని అతని బిజినెస్ అవదు.

అందుకనే సింహాచలానికి ట్రైన్ మీద అంత కోపంగా వుంది.

వరుసగా యింజను డ్రైవర్ దగ్గర నుండి, రైల్వే కూలీల దాకా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు సింహాచలం.

అతనికి 'డ్యూటీ' పది గంటలకి మొదలవుతుంది-

పాసింజర్లో తన 'డ్యూటీ' ముగించుకొని, అదే ట్రైన్‌లో అతను యింటికి వెళ్ళి పోతాడు.

పక్క స్టేషనే సింహాచలం వుండే వూరు.

మధ్యాహ్నం భోంచేసి మళ్ళీ వస్తాడు డ్యూటీకి

ఇలా రాత్రి పది గంటల దాకా వుంటుంది. అతనికి 'డ్యూటీ'-

సింహాచలం విసుగ్గా వాచీ చూసుకొన్నాడు.

పది కొండూ నలభై అయింది. తను వచ్చి అప్పుడే గంటన్నర దాటి పోయిందను కొన్నాడు.

అంతలో ట్రైన్ వచ్చేస్తుంది అన్నట్లుగా గంట కొట్టాడు పోర్టరు.

జేబులోంచి రుమాలు తీసుకొని మొఖాని కున్న చమటంతా తుడుచు కొన్నాడు సింహాచలం

సింహాచలం చేసే బిజినెస్‌లో అతను కాకుండా మరో యిరవై మంది వున్నారు. వాళ్ళందరికి 'సూర్యం' అనే లీడరే వున్నాడు. వీళ్ళుకాకుండా అక్కడ స్టేషన్‌లో వుండే పోలీసువాళ్ళు, అసిస్టెంటు స్టేషన్ మాస్టర్లు, ఇందులో షెరుహోల్డర్లు! అందు చేత సింహాచలం వాళ్ళమీద ఎన్ని రిపోర్టులు వచ్చినా వాళ్ళుచూసి చూడనట్టు వూరుకుంటారు. ఒక్కోసారి రెడ్‌హేండెడ్‌గా పట్టుబడినా, ఏదో హడావిడి ప్రదర్శించి వదిలేస్తుంటారు.

రాత్రి పది గంటలతో 'బిజినెస్' అయిపోతుంది. ఆ రోజు కలక్షన్ చూసుకొని ఎవరి షెర్లు వాళ్ల పుచ్చుకొని నవ్వుకుంటూ ఇంటికి వెళ్లిపోతారు.

వాళ్ళ అదృష్టాన్ని బట్టి, పాసింజర్ల అమాయకత్వాన్ని బట్టి వాళ్ళు డబ్బు సంపాదిస్తారు.

ఈ బిజినెస్‌లో అస్తమానూ లంచాలు రావు.

పాసింజర్లు వీళ్ళ సంగతి పసిగడితే, వాళ్ళు వీళ్ళతో కాసేపు 'ఫుట్‌బాల్' ఆడుకుంటారు.

పాసింజరు ట్రైను చాలా నీరసంగా వున్నట్టు అరుచుకుంటూ స్టేషన్‌లోకి వచ్చి ఆగింది.

జనంతో కలకలం.

కాస్సేపు స్టేషన్ అంతా "...అరే! ఎక్కనియ్యవయా... ఒలే అప్పా! యిటూ, యిటు..." ఓలమ్మ నాకాలు తొక్కేసినాడు—" ఆడి జిమ్మడ... 'ఒరిన్ని, మీ అసాధ్యం కూల నన్ను దిగని డయ్యా..." అన్న కేకలతో నిండిపోయింది.

జనం సర్దుమణిగాక సింహాచలం ఓక పార్టుమెంటులోకి అడుగెట్టాడు.

కంపార్టుమెంటు అంతా అప్పుడే కొత్త సినిమా రిలీజు అయిన థియేటరులా కిక్కిరిసి వుంది.

కిటికీకి ఆనుకొని అమ్మడు కూర్చుంది.

ఆమెకి ఎదురుగా గెడ్డబ్బాయి కూర్చుని అమ్మడి తమ్ముడ్ని వళ్ళో కూర్చోబెట్టుకొని చాక్లెట్లు తినిపిస్తున్నాడు.

కంపార్టుమెంటు అంతా ఒక్కసారిగా కలయజూశాడు సింహాచలం.

అతని చేతిలో అయిదు సెల్సు వున్న పెద్ద బ్యాటిరీ లైట్ వుంది.

ఆదాన్ని త్రిప్పుతూ, వెలిగిస్తూ గొంతుపెంచి మాట్లాడ్డం ప్రారంభించాడు.

"చూడండి బాబు - లక్కీఛాన్సు - స్టీలు సామాన్ల వేలం. అవి మీకు బయట అరవై డెబ్బై రూపాయలన్నా దొరకవు. ఇక్కడ చీపుగా పాతిక, ముప్పై రూపాయల్లో వస్తాయి సుడిబావుండక ఓశెట్టిగారు దివాలా తియ్యడంతో అవి వేలంలోకి వచ్చాయి బాబూ- పాటలో చాలా ఎట్రాక్షన్స్ లు వున్నాయి - ఎవరు ఎక్కువ పాడుకుంటారో ఈ పెద్ద బ్యాటరీలైటు వుచితం" అంటూ తన చేతిలో

వున్న బ్యాటరీ లైటు చూపించాడు.

ఒక్కసారి వూపిరి పీల్చుకొని మళ్లీ ఆరంభించాడు.

"మాకు ధర గిట్టుబాటు కాకపోతే జుట్టు దువ్వెన, అద్దం, ఆడవారు అయితే చెంప పిన్నులు, రిబ్బన్లు "ఉచితంగా" యిస్తాం" అంటూ అవి కూడా బేగ్‌లోంచి తీసి చూపించాడు.

ఇంతలో ముగ్గురు కంపార్టుమెంటులోకి ఎక్కారు.

ఒకడు గోల్డుకలర్ లాల్చీ, గ్లాస్కో పంచ కట్టుకొని, గోల్డు ఫ్రేమ్ వున్న కళ్లజోడు పెట్టుకొని చుట్ట కాలుస్తున్నాడు.

రెండోవాడు తెల్లటి పైజమా, లాల్చీతొడుక్కొని బీడీ కాలుస్తూ గుండు అబ్బాయి పక్కనే చోటుచేసుకొని యిరుక్కున్నాడు.

మూడోవాడు బెల్ పాంటు, గళ్ళ షర్టు వేసుకొని యిరుక్కున్నాడు.

అంతలో సింహాచలం బేగ్‌లోంచి రెండు స్టీలు కంచాలు తీసాడు.

అవి అప్పుడే సున్నంకొట్టిన యిళ్ళల్లా మెరిసిపోతున్నాయి.

"ఈ రెండు కంచాలు కలిసి బైట ఎనభై రూపాయలన్నా దొరకవు బాబు, - కాని కంపెనీ వారి పాట 'పది' రూపాయలు మాత్రమే."

పెట్టంతా నిశ్శబ్దం ఆయింది.

ఒక్కరూ పలకలేదు.

"అయ్యా పది రూపాయలు మాత్రమే- రెండు అందమైన స్టీలు కంచాలు ఒక్క పది రూపాయలకే— ఇవి బైట మీకు ఎనభై రూపాయలన్నా దొరకవు బాబు లక్కీ ఛాన్సు— పది రూపాయలు......ఒక్క పది రూపాయలకే ఈ రెండు స్టీలు కంచాలు...

"పన్నెండు రూపాయలు..." అంది చుట్ట

అంతా అటువైపు చూసారు-'ఎవడీ పాటగాడు...' అన్నట్టు.

"అయ్యా... ఆబాబుగారి పాట పన్నెండు రూపాయలు... ఈ రెండు స్టీలు కంచాలు... పన్నెండు రూపాయలకే...

"పదిహేను రూపాయలు" బీడీ.

"ఎవరుబాబు పది పదిహేను రూపాయలట..." అన్నాడు చూడనట్టు సింహాచలం -

"నేనే"- అంటూ చెయ్యి ఎత్తింది బీడీ.

"అయ్యా! పదిహేను రూపాయలంటున్నారు- బయట ఎనభై రూపాయలన్నా దొరకని కంచాలు పదిహేను రూపాయలకే...

"ఇరవై రూపాయలు"...అంది చుట్ట మళ్ళీ.

"బాబూ యిరవై రూపాయలండి. రెండు స్టీలు కంచాల ఖరీదు యిరవై ... బయట ఇదే అవార్డుల మీరు వాళ్లో పెడితే ఎనభై రూపాయలండి ... అయ్యా ఇరవై రూపాయలు..."

జనం అంతా అదే చూస్తున్నారు - 'ఎవరు ఎక్కువ పాడతారా' అని-

"ఇరవై అయిదు రూపాయలు" ... అంది సిగరెట్టు గట్టిగా - దాంతో జనం అంతా సిగరెట్టు వంక చూసారు

"బాబూ - పాతిక రూపాయలు ... రెండు స్టీలు కంచాలు, పాతిక రూపాయలకే... రెండూ ... ఒక్క పాతిక రూపాయలకే..."

ఎవ్వరూ పలకలేదు-

"రెండు కంచాలు పాతిక రూపాయలు... ఒకటవ సారి..." ఊహూ! ఈ సారి జనం పలకలేదు.

"బయట ఎనభై రూపాయలకి కూడా దొరకని రెండు "స్టీలు కంచాలు" పాతిక రూపాయలకే... రెండవసారి..."

జనం వుగ్గబట్టుకొని చూస్తున్నారు-

మెల్లిగా గొంతు సవరించుకొని మళ్ళీ అన్నాడు-

"...రెండవసారి..."

"..........."

"అయ్యో! ఒక్క విషయం... ఈ రెండు కంచాలు ఎనభై రూపాయలన్నా బయట మీకు దొరకవు ... ఇవి కనక పాతిక రూపాయలకి యిచ్చేస్తే మాకు గిట్టుబాటు అవదు- అందుచేత దయచేసి ఈ దువ్వెన్న వుంచుకోండి..." అంటూ ఒక అందమైన దువ్వెనను నిగరెట్టుకి ప్రజెంట్ చేసాడు.

జనం వంక చూస్తూ, నవ్వుతూ దువ్వెన అందుకొని జేబులో పెట్టుకొన్నాడు నిగరెట్టు-

జనం అంతా అతని వంక మెచ్చుకోలుగానూ, కొంచెం అసూయగానూ చూసారు, వుత్తినే అందమైన దువ్వెన్ను కొట్టేసినందుకు-

బేగ్‌లోంచి మరో రెండు స్టీలు గిన్నెలు తీసాడు సింహాచలం-

పాట మొదలైంది-

ఈసారి దువ్వెన బీడికి వచ్చింది-

జనంలో కొంచెం కదలిక వచ్చింది.

గుండు అబ్బాయి మాత్రం యిదేంపట్టించుకోకుండా క్షణంవేస్తుచెయ్యకుండా అమ్మడిన్ని 'కళ్ళ'తో తినేస్తున్నాడు

అమ్మడు అతని అవస్థచూసి ముసిముసిగా నవ్వుకొంటోంది.

పెట్టెలో కొందరికి 'వేలం' కన్నా ఈ 'సీను' చాలా బావుందనిపించింది.

అందుచేత కొంతమంది యిటు తిరిగారు

సింహాచలం వ్యవహారం గ్రహించాడు.

గుండు అబ్బాయిని ఆగి 'పెంకి'మీద కొడదామనుకున్నాడు.

తర్వాత 'బావుండ'దని మానేసాడు.

ఒక్కసారి అటు, యిటు. చూసి స్టీలు డేగిసా బైటకి తీసాడు సింహాచలం.

మళ్ళీ పాట మొదలైంది.

ఈసారి అందమైనఅద్దం చుట్టకిదక్కింది

దాంతో జనం 'సీనుల' మాట మర్చిపోయారు- పూర్తి కలకలం బయలుదేరింది.

మెల్లగా గుసగుసలు బయలు దేరాయి.

"సర్దాగా పాడదాం...వాళ్ళకి గిట్టుబాటు కాకపోతే దువ్వెనో, అద్దమో" వత్తాడిగా- అన్నమాటలు బయలు దేరాయి.

అదే సింహాచలానికి కావలసింది.

రెట్టింపు వుత్సాహంతో బేగులోంచి స్టీలు కేరియరు తీసాడు.

"బాబూ—ఇది బయట రెండు వందలన్నా దొరకదు. అందమైన స్టీలు కేరియరు. ఆరు గిన్నెలున్నాయి. అన్ని పదార్థాలు పెట్టుకో దానికి అనువైనది. ఉద్యోగం సేసుకొనే బాబులకి చాలా ఉపయోగంగా వుంటది. 'కంపెనీవారి పాట ఇరవై రూపాయలు మాత్రమే" అన్నాడు.

పాట మొదలైంది.

ఇదంతా ఓమూల నించి చూస్తూ పేపరు చదువుతున్న ఓ ముసలాయన పేపరు మడిచి రంగంలోకి దిగాడు

ఆయనికి ఓ అరవై ఏళ్లు వుంటాయి. మొఖం అంతా ముడతలు పడింది- ఆయనకి ఒక్క నల్ల వెంట్రుక కూడా లేని తెల్లటి బుర్రమీసాలు వున్నాయి- మెళ్ళో గోల్డుచైన్ మాత్రం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

ముసలాయనతోబాటు మరో నలుగురు రంగంలోకి దిగారు.

అందరి దృష్టి కారియర్ మీదకన్నా - అందమైన దువ్వెనల మీద, అద్దాల మీద వుంది.

బీడి ఇరవైని ముప్పై చేశాడు.

దాన్ని చుట్ట నలభై చేశాడు.

'తను తక్కువ తిన్నట్టా!' అని నలభైని అరవై చేశాడు సిగరెట్టు.

అందరూ అతనివంక చూసారు. ఈసారి కూడా యితనేఅందమైన దువ్వెనని కొట్టేస్తాడేమో నని-

దాంతో ముసలాయన అరవైని డెభ్భై చేసాడు.

యింకొకడు ఎనభై అన్నాడు.

సిగరెట్టు గర్వంగా, గట్టిగా "తొంభై" అన్నాడు.

దువ్వెన తనకే రావాలన్న పంతంతోముసలాయన ఆలోచించకుండా "వంద రూపాయలు"- అన్నాడు.

కంపార్టుమెంటు అంతా నిశ్శబ్దంఅయింది.

అందరూ ముసలాయనవంక చూసారు. ఈ సారి యీయన ఆ అందమైన దువ్వెన కొట్టేస్తాడే అన్నట్టు.

దాంతో సింహాచలం అప్పుడే నడకవచ్చిన చంటి కుర్రాడిలా గెంతుతూ-

"అయ్యా!...ఆ గోల్డుచెయిన్ ముసలాయన పాట వంద రూపాయలు...అక్షరాలా వందరూపాయలు. అందమైనస్టీలు కేరియరు వంద రూపాయలకే బాబూ...బాబూ... వంద.. వంద..." అన్నాడు.

జనం అంతా ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు-

గోల్డు చెయిన్ ముసలాయన గర్వంగా మూతి తుడుచుకోటున్నట్టుగా తన బుర్ర మీసాల మీద చెయ్యేసుకున్నాడు- ఈసారి అందమైన దువ్వెన తనదే అన్నట్టు-

జనం అంతా 'యింకా ఎవరు పాడతారా!' అన్నట్టు ఎదురు చూస్తున్నారు-

సింహాచలం గొంతు మాత్రం ఖంగు మంటూ వినబడుతోంది-

'... అయ్యా! అందమైన స్టీలు కేరియర్... ఆరు గిన్నెల స్టీలు కేరియర్ వంద రూపాయలకే..."

'...........'

సింహాచలం పరిస్థితి అర్థం చేసుకొన్నాడు

'స్టీలు కేరియర్ ఖరీదు వంద రూపాయలు... ఒకటవ సారి...' అన్నాడు-సమాధానం లేదు-

'అయ్యా! ఆరుగిన్నెల స్టీలు కేరియర్... వంద రూపాయలకే ... రెండవసారి...'

దాంతో గోల్డు చెయిన్ ముసలాయన మొహంలో కొంచెం కంగారు తొంగి చూసింది-తొందరగా మీసాల మీంచి చెయ్యి

తిశేసాడు-

'అయ్యా ! గోల్డు చెయిన్ గారి పాట ... వంద రూపాయలు ... రెండవసారి, మళ్ళీ నిశ్శబ్దం...

'స్టీలు కేరియర్ వందకే? ... మూడవ సారి కొట్టేస్తాం...' అంటూ సింహాచలం గుండెల నిండా వూపిరి పీల్చుకొన్నాడు-

ముసలాయనకి మాత్రం గుండె యిరుకు పట్టినంత పనైంది.

ఆ స్టీలు కేరియర్ వంద రూపాయలా... కొట్టేసారా ... అయితే తనకి దువ్వేన లేదా ...' అనుకొంటున్నాడాయన...

సింహాచలం ఆ స్టీలు కేరియర్ని జాగ్రత్తగా, పీటుగా తుడిచి ఆ ముసలాయన ప్రక్కనే పెట్టాడు-

ఆయన అయోమయంతో వద్దాడు-

జనం అంతా ఆయన వంకే చూస్తున్నారు ఏంచేస్తాడో అని-

ఆయన మొహం యింద్ర ధనస్సులో వున్న అన్ని రంగుల్లోకి మారింది-

తీసుకోక పోతే జనం అంతా నవ్వుతారు- పెద్ద పోటుగాడిలా పాడావంటారు-పై పెచ్చు అందరూ తన్నే ఆడతారు-తెలుసుండి పాడి వద్దంటున్నందుకు..." అంటూ ఆలోచించు కొన్నాడు.

"పై పెచ్చు అది స్టీలుది కూడానూ... బయట ఎంత తక్కువ కాదనుకున్నా రెండు వందలు చేస్తుంది" ... అని సర్ది పెట్టు కొన్నాడు-

వణుకుతున్న చేతుల్తో పర్స్ తీసి అందు లోంచి ఓ వంద రూపాయలనోటు అందు కొని సింహాచలం చేతిలో పెట్ట బోయాడు.

అదిగో అలాంటి సమయంలో కంపార్టు మెంటులోకి అడుగెట్టారు ఓ హెడ్ కానిస్టేబుల్ గారు. ఆయన బామ్మరిదీని-

కానిస్టేబుల్ గారు చూడ్డనికి రిటైర్డు సోల్జర్లా వుండారు-

అప్పుడాయన మొహం కొలుంలో కాల్చిన యినుపకడ్డిలా ఎర్రగా కోపంగా వుంది-

ఆయనకళ్ళు తీక్షణంగా సింహాచలాన్నే చూస్తున్నాయి.

ఆయన చేతులు "బాగా తీట" పట్టినట్టు న్నాయి.

ఆయన ఎవ్వర్ని కేర్ చెయ్యనట్టు కనబ డుతునాన్నారు.

ఆయన బామ్మర్దికి ఓ నలభై ఏళ్ళుం టాయి-

ఆయన తం అప్పుడే పెట్టిన కోడి గుడ్డులా నున్నగా వుంది.

ఆయన మొహం మాత్రం చాలా అమా యకంగా వుంది.

కానిస్టేబుల్ గారు లోపలకి రాగానే తన బామ్మర్దివి దగ్గరగా పిలిచారు.

"ఒరే బామ్మర్ది... నువ్వెళ్ళి ఆణ్ణి పక్కకి పిలు-మామూలుగా వీడబ్బు వాపను యిమ్మను... ఆస్టీలు కేరేజీ సరుకయి పోయిన బోగందాన్లా వళ్ళు దాచు కోకుండా సిల్వరుగా మారి పోయిందని చెప్పు-వాడు తినక డబ్బు యివ్వక పోతే నేనొచ్చి అని సంగతి చూస్తాను"- అన్నారు-

బామ్మర్ది బుద్ధిమంతుడైన కుర్రాళ్ళా తలూపి సింహచలం దగ్గర కెళ్ళాడు-

అప్పుడు సింహచలం నవ్వుతూ గోల్డు చెయిన్ గారి దగ్గర వందనోటు పుచ్చు కొంటున్నాడు-

సింహాచలాన్ని వెనక్కి పిలిచి కానిస్టేబుల్ గారు చెప్పిన విధంగా అడిగాడు-

అంతలో చుట్టా,బీడి,సిగరెట్టు వాళ్ళు చుట్టూ చేరారు-

సింహాచలం బామ్మర్దిని ఓసారి ముష్టి వెధవ కింద మాసినట్టు చూసాడు-

"అది అమ్మింది నేను కాదు...ఫో-" అన్నాడు-

"నేపోను...నువ్వే అమ్మావ్"-అన్నాడు ధైర్యంగా బామ్మర్ది

"నేను అమ్మలేదని చెబుతుంటే విన బట్టలేదూ...కావాలంటె నీదిక్కున్న చోట చెప్పుకో"- అన్నాడు సింహాచలం-

అదే సింహాచలం చేసిన ఘోరమైన తప్పు-

"దిక్కున్న చోట అన్న పదం రాకెట్ స్పీడులో వచ్చి కానిస్టేబుల్ గారి చెవులో పడింది-

ఆయనకి ఒక్క సారి నూకాలమ్మ పూనినట్టయింది-

ఒక్క వూపుతో ఆల్సేషియన్ డాగ్ లా పరుగెట్టు కొచ్చి సింహాచలం షర్టు పుచ్చు కొని ఒక్కటి లాగాడు—

సింహాచలానికి ఆయనెందుకు కొట్టాడో అర్థంకాలేదు-

ఆ కానిస్టేబుల్ని సింహాచలం రోజూ స్టెషన్ లో చూస్తూవుంటాడు- నమస్కారం చేస్తుంటాడు- కాని తన్నెందుకు కొట్టాడో అర్థంకాలేదు-

ఒక్క సారి సింహంలా అరిచారు కానిస్టేబుల్ గారు-

"మా బామ్మరిదికి బుర్ర మీద ఎంటికలు లేవుకదాని టోపీ ఏసేత్తరా యదవ నాయాళ్ళలారా! యముకలిరగ దొడిసేత్తాను. ఎర్రె దెవని చేసి ఓదువ్వె నోన్నటి సినిమాలో జ్యోతిలక్ష్మిని సూపించినట్టు సూపించి సిల్వర్ సామాన్లు అంట గట్టేత్తార్రా. సచ్చినా కొడల్లారా! ఏదో కూటి కోసం విద్దలు, తిండానికేదో ఒకటి సెయ్యాలికదా అని సెప్పి సూసి సూడకుండా ఒగ్గేస్తుంటే నా కొంపకే యెట్టి, మాబామ్మర్దికే టోకరా కొడ్తార్రా! శవా లెనకాల సిల్లర దబ్బు తేరుకొనే శట్కారీ ఎదవల్లారా"—అంటూ యింకోటి గూబమీదలాగారు-

సింహాచలం వెళ్ళికిటికి తగులు కొన్నాడు-

అతనికి పట్ట పగలే నక్షత్రాలు కన బడ్డాయి-

అతని వళ్ళు బాణం దెబ్బ తిన్న లేడి పిల్లలా వణుకుతోంది-

అతనికి పరిస్థితి కొంచెం అర్థమైంది-

ఏదో చెబుదామను కొన్నాడు-కాని కానిస్టేబుల్ గారి బలమైన చేయ్యి చూసి చెప్ప లేక పోయాడు-

మెల్లగాచుట్టా, బీడీ జారుకొన్నారు -

"నాకేం తెలవంటావురా పుండాకోరు గాడిద కొడకా... నేనెవర్ని ...పోలీసోణ్ని ... మాబాబు యస్సయిగా రిటైర్డు అయ్యాడు... నాది ఏం బ్లడ్ అనుకొన్నావురా ... పోలీస్ బ్లడ్ - నీగుండెల్ని చీల్చి భీముడి తమ్ముళ్ళా నీ రక్తాన్ని తాగేస్తాను - లేదా నిన్నూ - నీ బేచ్ని ఒక్ఫ్రాడ్ కేసులో యిరికించి ఒక నాలుగేళ్లు బొక్కలో పెట్టించే గల్ను - మర్రాదగా మా బామ్మరిదికి దగ్గర కొట్టేసినా వంద రూపాయలు కక్కు -" అంటూ ఫైనల్ గా, ఒతన్ను తన్నారు -

అంతాపుచ్చుకొని 'సిగరెట్టు'మీద పడ్డారు సింహాచలం -

అంతలో లక్కీగా వాళ్ళలీడర్ సూర్యం వచ్చాడు -

సూర్యాన్ని చూడగానే కానిస్టేబుల్‌గారు కొంచెం తగ్గారు -

సూర్యం కానిస్టేబుల్‌గార్ని బైటికి పిలిచి వందరూపాయలు ఆయన చేతిలో పెట్టి సింహాచలాన్ని తాపులనుంచి రక్షించాడు.

ఆనోటుని విలాసంగా అందుకొంటూ... ''ఒరే సూర్యం ఎవరికమ్ముతున్నారో కాస్త చూసుకోండిరా... ఆ సింహాచలంగాడ్ని ఏడవద్దని చెప్పు... ఆటతో అరటిపండులా కొట్టేసేను ... యింకో యిసయం ... ఇలా అప్పుడప్పుడు పబ్లిక్‌లో ఎవర్నో ఒకర్ని తన్నకపోతే మాకు వేల్యూ వుండదు ... పోలీసోడంటే ఎవరూ బయపడ్రు - అందుచేత వాణ్ని రెండు గట్టిగా కొట్టాను - ఏమీ అనుకోద్దను - ఒరే బామ్మరిది! నీదగ్గర పావలావుందిరా -'' అన్నారు.

బామర్ది 'వుందని' తలూపి జేబులోంచితీసి యిచ్చాడు.

''యిందు... ఈ పావలాయిచ్చి సింహాచలంగాణ్ని కాఫీ తాగమను'' అంటూ సూర్యం చేతిలో పావలా పెట్టాడు -

సూర్యం నవ్వుత్తూ ఆ పావలా తీసుకొన్నాడు -

''మరయితే మాం వస్తాం-రా బామ్మరిది'' అంటూ ముందుకి అడుగేసారు కానిస్టేబుల్‌గారు -

బామ్మరిదికి అంతా మాజిక్‌లా వుంది -

అసలతను ఆవొంద రూపాయలు గంగలో కలిసి పోయాయనుకున్నాడు - ఇలా బావగారు తనతరుపున వాణ్ని తన్ని డబ్బు లుచ్చుకొంటారని వూహించలేదు -

కానీ ఒక చిన్న అనుమానం వుండిపోయింది అతనికి -

''కాదు - బావా! నాదో సిన్న అనుమానం... అడుమనకి డబ్బు యిచ్చేసాడు కదా! - మనం ఆకేరేజీ తిరిగి యిచ్చెయ్యొద్దు మరి'' అన్నాడు అమాయకంగా -

ఆ అమాయకత్వాన్ని చూసి కానిస్టేబుల్‌గారు 'బియ్యంలో రాళ్ళెందుకు కలుపుతారు నాన్నా' అన్న ఆరేళ్ళ కొడుక్కి సావుకారుగారు సమాధానం చెప్పినట్టు, నవ్వుతూ చెప్పారు...

''ఒరే బామ్మరిది ... నీకు గుండుమీద ఎంట్రుకలు లేకపోయేటప్పటికి వున్న బుర్ర కాస్తా పోయిందిరా... లేకపోతే ఎక్కడయినా పోలీసోడికిచ్చిన సామాన్లు, భోగందానికి యిచ్చినడబ్బు తిరిగి వస్తాదేటి'' - గీతా' రహస్యం చెప్పినట్టు చెప్పారు -

బామ్మర్ది 'అర్ధమైనట్టు' తలూపాడు -

సింహాచలం యింటిదగ్గర అద్దెసైకిల్ దిగేటప్పటికి సీతారత్నం నవ్వుతూ అప్పుడే ఎదిగిన గులాబి మొక్కలాగ గుమ్మంలో నుంచోనుంది -

మొగుణ్ని చూసి కొంచెం తత్తరపడి సిగ్గుపడింది -

సీతారత్నం చాలా అందంగా వుంటుంది -

ఆమెది ఎంతఅందం అంటే ఆమెకి ఒక బెల్ ప్యాంటూ, షర్టువేస్తే కాలేజీ అమ్మాయిలు అసూయపడేలాగ. అబ్బాయిలకి రాత్రిళ్ళు నిద్రలేకుండా చెయ్యగల అందం ఆమెది -

అప్పుడు సింహాచలం తన్నులుతిన్న గుడ్డలొదిలేసి పండగబట్టలు వేసుకొని పేదవాడి వేషంవేసిన సినిమాహీరోలా వున్నాడు -

అతని చేతిలో ఒక అందమైన మల్లెపువ్వుల దండవుంది -

మరోచేతిలో సీతారత్నం కోసం తెచ్చిన ఎర్రటి యెంకటగిరి జరీఅంచు చీరెవుంది -

అతని నుదురుమీద మాత్రం 'చంద్రుడికో మచ్చలాగ' తెల్లటి ప్లాస్టర్ అంటించబడి వుంది -

ఆ ప్లాస్టర్‌ని చూసి కంగారుపడింది సీతారత్నం -

ఆవేళ నెమలికంఠంరంగు చీరె కట్టుకొని పురివిప్పిన నెమలి పిల్లలావుంది సీతారత్నం-

ఆమెకి ఆనందం కలిగితే మెరిసే అందమైన కళ్ళున్నాయి -

సిగ్గొస్తే, ఎరుపెక్కి నిగారింపులో ఉన్న యాపిల్ పళ్లలాంటి బుగ్గలున్నాయి -

వాటికి నవ్వినప్పుడల్లా అందంగాపడే సొట్టలున్నాయి - అస్తమానూ పెదాలమీద అందమైన చిరునవ్వు చిందిస్తూనే వుంటుంది -

సింహాచలానికి ఆ బుగ్గలన్నా, సొట్టలన్నా, ఆచిరునవ్వుఅన్నా వల్లమాలిన యిష్టం -

అతను సైకిల్‌కి స్టాండువేసి వచ్చేటప్పటికి సీతారత్నం కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు తెచ్చింది -

చీరా, మల్లె పువ్వులు ఆమెకిచ్చాడు సింహాచలం -

నీళ్ళు అందుకొంటూ సీతారత్నం చెయ్యి పట్టుకున్నాడు సింహాచలం -

సీతారత్నం వొళ్ళు చిరుగాలికి వూగే కొబ్బరాకులాగ ఒక్కసారి జలదరించింది -

చెయ్యి విడిపించుకొంటూ బుగ్గలు సొట్ట పడేలా లవ్‌లీగా నవ్వింది సీతారత్నం -

"అత్తమ్మఏది" - అన్నాడు.

"ఫోంచేసి యిప్పుడే నడుం వాల్చింది"- అంటూ ముసి ముసిగా నవ్వింది సీతారత్నం.

సింహాచలం కాళ్ళు చేతులూ కడుక్కొని తనగదిలోకి అడుగెట్టాడు -

ఎప్పుడూ సిగరెట్ల పీకలతోనూ. మాసిన గుడ్డలతోనూ చిరాగ్గావుండే అతని గది నీటుగా అమర్చబడి, అందమైన హోటల్లో సింగిల్ రూంలావుంది -

గూట్లో అద్దం, దువ్వెన, స్నో వగైరాలు అమర్చబడి వున్నాయి -

ఆగదిని అలా చూడగానే "అందుకనే యిల్లుని చూసి యిల్లాల్ని చూడాలంటారు పెద్దలు" - అనుకొన్నాడు -

అతను వంటింట్లోకి వచ్చేటప్పటికి రెడీగా పీట వేసివుంది -

దానికెదురుగ్గా కంచం, పక్కనే మంచినీళ్లు వున్నాయి -

కంచం పక్కగా పండగ స్పెషల్ పాయసంవుంది -

పీటకి కొంచెం దూరంలో విసనికర్ర వుంది -

పక్కనే సీతారత్నం పాలరాతి విగ్రహంలా కూర్చుంది -

ఇవ్వన్నీ చూడగానే యిందాక తను తిన్న తన్నులు మర్చిపోయాడు సింహాచలం -

అతను అన్నం కలుపుకొంటూ వంటిల్లంతా కలియచూసాడు -

ఆగదినిండా సామానుతో నిండిపోయింది -

సింహాచలం అత్తగారి 'చాదస్తానికి' నవ్వుకొన్నాడు -

"ఏం జేరత్నం - అత్తమ్మ నీకింత 'సారె' యిచ్చింది - మా మావగాని ఏకొట్టుకన్నా కన్నం వేయ్యలేదుకదా ?" అన్నాడు నవ్వుతూ -

అతని జోక్‌కి నవ్వుతూ 'లేదన్నట్టు' తలూపింది సీతారత్నం -

"అదికాదు మావ - పొద్దున్న మేం రైల్లోవస్తుంటే ఎవరో 'స్టీలు' సామాన్లు వేలం వేసారు - అందులో నేనూ, మా అమ్మ కలసి యియ్యన్ని కొన్నాం బావున్నాయా?" అంది -

ఆమాట వినగానే...

తనుతీసిన 'సెక్స్' సినిమాల్ని ప్రివ్యూలో ఫ్రీగాచూసి ఆదేఫేషన్ అనుకొని చెడిపోయిన కూతుర్నిచూసిన ప్రొడ్యూసర్లా - జైలుకుమాత్రం దూరంగావుంటూ, అనవసరంగా చిన్నసైజు కాలేజీ పోలటిక్స్‌లో జైలుపాలైన కొడుకుని చూసిన పొలిటికల్ ఫాదర్‌లా ... సింహాచలం ఒక్కసారి గతుక్కుమన్నాడు -

అంతే సింహాచలానికి గొంతులో ముద్ద దిగబడలేదు - *

— కెయస్సార్